క్లుప్తంగా

డిగ్రీ విద్యార్థికి క్రీడా మేథో ఉపకార వేతనం



విద్యార్థి గౌతమ్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: తమ కళాశాల విద్యార్థి క్రీడా మేథో ఉపకార వేతనం అందుకోవడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయులురెడ్డి తెలిపారు. ఆయన గురువారం విద్యార్థి గౌతమ్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న గౌతమ్ ఈ ఏడాది గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడని తెలిపారు. దీంతో అతనికి క్రీడా మేథో ఉపకార వేతనం వరించినట్లు తెలిపారు. క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ ప్రసాద్‌ను అభినందించారు.

పూడి రైల్వే గేటు మూసివేత

వడమాలపేట: వడమాలపేట– తిరుచానూరు మార్గంలోని పూడి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న రైల్వే గేటును రెండు రోజులు రాత్రి పూట మూసివేసి మరమ్మతులు చేపడుతున్నట్లు పుత్తూరు రైల్వే సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. ఈనెల 17 వతేదీ రాత్రి 8 గంటల నుంచి 18 ఉదయం 6 వరకు, 18 వతేదీ రాత్రి 8 గంటల నుంచి 19 ఉదయం 6 వరకు మూసి ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. కావున వాహన దారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

వాహనాల వేలంతో రూ.25,960 ఆదాయం



ద్విచక్రవాహనాలను వేలం వేస్తున్న ఏఈఎస్ ఆయేషా బేగం

కార్వేటినగరం: ద్విచక్ర వాహనాల వేలంలో ప్రభుత్వానికి రూ.25,960 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం తెలిపారు. మద్యం తరలిస్తూ పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేశారు. ఎస్‌ఐ దస్తగిరి, ఏఎస్‌ఐ మునికృష్ణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: ఎంపీడీఓ శ్రీదేవి గురువారం పాతవెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడితే విద్యార్థుల్లో రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ శివయ్య, హెచ్‌ఎం.నాగరాజులునాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం దిగువ గూళూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెంగల్‌రాయులు గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ తదితరులు ఉన్నారు.

వ్యాఘ్రంపై సోమస్కందమూర్తి

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సోమస్కందమూర్తి వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అనంతరం ఆలయంలో కంకణభట్టార్ ఉదయస్వామి ఆధ్వర్యంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి గజవాహన సేవ కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా స్వామికి కర్పూర నీరాజనాలు పలికారు. డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి పాల్గొన్నారు.

హంస, శుక వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, ఆకట్టుకుంటున్న వినాయకుడి ప్రతిమ







శోభాయమానంగా వెలిగిపోతున్న వాయులింగేశ్వరుని క్షేత్రం

రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా..

- ద్వాదశ జ్యోతిర్లింగాలు, రుద్రాక్షల శివలింగం ప్రారంభం
- భక్తి భావన ఉద్దీపనం చేస్తుందన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు, రుద్రాక్షలతో చేసిన శివలింగాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏటా బ్రహ్మకుమారీలు ద్వాదశ జ్యోతిర్లింగాలు, రుద్రాక్షల శివలింగాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఇది ప్రజల్లో భక్తిభావం పెంచుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఓంశాంతి సిస్టర్ రమణి, జ్యోతి, అర్చన, పాలకమండలి సభ్యులు సాధన మున్నా, జయశ్యామ్, 1వ పట్టణ సీఐ అంజుయాదవ్, పార్టీ నాయకులు సెన్నీరు కుప్పం శేఖర్, వెంకట సుబ్బయ్య, స్వామిరెడ్డి భరత్ రెడ్డి, బాలగౌడ్, సునీల్, తేజ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 300మంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలందించనున్నారు. పురపాలక, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల నుంచి స్కౌట్స్ గైడ్స్, రోవర్స్, రేంజర్స్ కలిసి సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నారు. వీరికి భక్తులతో నడచుకోవాల్సిన విధానంపై శిక్షణ ఇచ్చారు.

ముక్కంటి బ్రహ్మోత్సవాల్లో నేడు

శ్రీకాళహస్తి రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు మాఘ బహుళ ద్వాదశి శుక్రవారం నాగరాత్రి నాలుగవ తిరునాళ్ల సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామి వారు హంస వాహనంపై, జ్ఞాన ప్రసూనాంబ శుక వాహనంపై పుర వీధుల్లో విహరిస్తారు. ఈ ఉత్సవాలకు మండలంలోని చుక్కలనిడిగల్లుకు చెందిన 42 ఎకరాల భూదాత, దివంగత ఎస్‌ఐ ముద్దుకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు. రాత్రి 8 గంటలకు స్వామివారు శేషవాహనం, అమ్మవారు యాళి వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

కళా నీరాజనం..పులకరించిన భక్త జనం

శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం ధూర్జటి కళా ప్రాంగణంలో పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శ్రీవాసవి మహిళా మండలి రేణుకమ్మ బృందం భక్తి రంజని కార్యక్రమం, పసుమర్తి బృందం కర్ణాటక సంగీతం, శ్రీనివాస మంగాపురం శ్రీ స్వరూపానందగిరి స్వామి ప్రవచనం, అశ్రితాశ్రి, శ్రీకాళహస్తికి చెందిన అక్షయ చరిత, కాంచీపురానికి చెందిన భరతాలయ నృత్యకేతన్ బృందం, బద్వేలుకు చెందిన శివం, సతీష్, శ్రీకాళహస్తికి చెందిన యోగీశ్వరి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వర్ధమాన సినీ గాయకులు, 'పాడుతా తీయగా' గాయకులు యం.యల్.ఆర్. కార్తికేయన్ బృందం భక్తి సంగీత విభావరి, మోక్షిత, యజ్ఞశ్రీ ఇంద్రజాల ప్రదర్శనలు భక్తులను పులకరింపచేశాయి. శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వర నాట్యమండలికి చెందిన చెంబేటి ఆనంద్ బాబు పంచతంత్రం నాటకాన్ని ప్రదర్శించారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో 18 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆరోజుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న దృష్ట్యా ఈ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీకాళహస్తి–తిరుపతి మధ్య 19 నాన్‌స్టాప్ సర్వీసులు, మరో 12 పల్లె వెలుగు సర్వీసులు నడుస్తుండగా అదనంగా 50 ట్రిప్పులు నడపనున్నట్లు చెప్పారు. పిచ్చాటూరు మార్గంలో 7 సర్వీసులు ఉండగా అవసరాన్ని బట్టి అదనంగా నడుపుతామన్నారు. నాయుడుపేట మార్గంలో ప్రస్తుతం రెండు సర్వీసులకు తోడు మరో సర్వీసు, చెన్నైకు ప్రస్తుతం ఆరు సర్వీసులకు అదనంగా మూడింటిని, గుడిమల్లానికి ఒక సర్వీసు, చెన్నై మార్గంలో తడ వరకు ఒక సర్వీసు నడపనున్నట్లు వెల్లడించారు. మహాశివరాత్రి బస్సు సర్వీసులన్నిటిపై శివరాత్రి వాల్‌పోస్టర్లు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు.



ఊరేగింపు వద్ద కోలాట ప్రదర్శన

ప్రధాన ఉత్సవాలు జరిగే నాలుగురోజులు బస్సు సర్వీసులన్నింటినీ స్వర్ణముఖి బస్టాండ్ వరకు కొనసాగించనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో డీఎంపురం విద్యార్థుల ప్రతిభ

కార్వేటినగరం: రాష్ట్రస్థాయి నెట్ బాల్ క్రీడల్లో డీఎంపురం విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం నమశ్శివాయ తెలిపారు. ఆయన గురువారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు హెచ్.జ్యోత్స్న, ఏ.కావేరి, ధర్మతేజ అండర్–14 విభాగంలో మంచి ప్రతిభ చూపారని తెలిపారు. పిల్లలకు బాగా శిక్షణ ఇచ్చిన పీఈటీ తిరుమలరాజును అభినందించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నమశ్శివాయ

ఏఎంసీ చైర్మన్‌గా మునస్వామి

శ్రీరంగరాజపురం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వెదురుకుప్పం మండలం ఎర్రగుంటపల్లెకు చెందిన నెల్లేపల్లె మునస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వైస్ చైర్మన్ గోపి, సభ్యులు లక్ష్మమ్మ, ఎలిజబెత్, గోవిందరెడ్డి, బుజ్జి, నీలమ్మ, సుజాత, రాజేశ్వరి, మునలక్ష్మి, రాణి, వింజం జయమాలిని, సురేష్‌బాబు, గఫూర్‌తో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. వారిని వెదురుకుప్పం జెడ్పీటీసీ సుకుమార్, మాజీ జెడ్పీటీసీ మాధవరావు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పద్మనాభరెడ్డి, మండల కన్వీనర్ పేట ధనుంజయరెడ్డి, పారిశ్రామిక వేత్త రాజశేఖర్‌రెడ్డి సత్కరించారు. చైర్మన్ మునస్వామి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి మూడు మండలాలకు ఏఎంసీని ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మునస్వామి

ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలి

పాలసముద్రం: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ పనులు కల్పించాలని ఏపీఓ బాల ఆదేశించారు. ఏపీఓ గురువారం జేఈ అనుషాతో కలిసి ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగా పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. ప్రతి కుటుంబానికీ 100 రోజుల పనులు కల్పించాలన్నారు. ప్రస్తుతం రైతులు మునగ, పండ్లతోటల పెంపకం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మునస్వామి, ప్రభు, లోకేష్, గోవిందరాజులు, సీనియర్ మేట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ బాల

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: సేంద్రియ వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో వలంటీర్లు, రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షను బట్టి ఎరువులు వాడాలని, అంతర పంటల సాగుతో మిత్ర పురుగుల వృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఈ విషయాలను రైతులకు వివరించి సేంద్రియ వ్యవసాయంపై మక్కువ కలిగించాలని సూచించారు.

బయోమెట్రిక్ తప్పనిసరి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో విద్యావతి

పాలసముద్రం: సచివాలయాల సిబ్బంది ప్రతిరోజూ బయోమెట్రిక్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంపీడీవో ఎస్ విద్యావతి ఆదేశించారు. ఆమె గురువారం వనదుర్గాపురం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకోవడానికి సచివాలయంలో ఉండాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

నేటి నుంచి మహాకుంభాభిషేకం

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళంలో చోళరాజుల కాలంలో నిర్మించిన ఉమామహేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, రజతోత్సవ సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం వేడుకలను శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం కలశ స్థాపన, వాస్తుగణపతి పూజ, హోమం చేస్తామన్నారు. 18న ఉదయం నవగ్రహ, రుద్ర, నమక, చమక, పారాయణం, హోమం, లక్ష్మీ లలిత హోమాలు, పూర్ణాహుతి, రాత్రి మహాశివరాత్రి వేడుకలను నిర్వహిస్తామన్నారు. 19న సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం స్వామి వారిని పుష్ప పల్లకిలో ఊరేగిస్తామన్నారు.



కుంభాభిషేకానికి సిద్ధమైన ఆలయం

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లత తెలిపారు. ఆమె గురువారం జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ఆవరణలోని ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నట్టు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని పిల్లలకు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గాజుల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ లత

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

వెదురుకుప్పం: రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చిత్తూరు ఆర్డీఓ రేణుక ఆదేశించారు. ఆమె గురువారం వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు తప్పనిసరిగా శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఆదేశించారు. వివాదాస్పద భూములు సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీఓ రేణుక

ఎమ్మెల్యేగా గెలవలేని అసమర్థుడు లోకేష్

విజయపురం : నారా లోకేష్ ఎమ్మెల్యేగా కూడా గెలవలేని ఓ అసమర్థుడని, అలాంటి వ్యక్తికి మంత్రి గురించి మాట్లాడే అర్హత లేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపినాథ్ అన్నారు. ఆయన గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత 40 ఏళ్లలో ఎంతో మంది ఎమ్మెల్యే అయినా, మంత్రి ఆర్కే రోజా చేసిన అభివృద్ధి ఎవ్వరూ చేయలేదని చెప్పారు. అంతే కాకుండా తాను సొంతంగా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి ఎంతో మందిని ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేయడానికే నగరిలో ఇల్లు నిర్మించుకున్నారని, అది ఓర్వలేక మహిళలను రెచ్చగొట్టి ఇంటిపైకి పంపడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, కుమార్‌రెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నేత్రపర్వం.. స్వర్ణ రథోత్సవం



మాడ వీధుల్లో గజ వాహనంపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న



స్వర్ణ రథంపై ఊరేగుతున్న కలియుగ వైకుంఠనాథుడు

- కనుల పండువగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- హనుమంత, గజవాహనాలపై శ్రీహరి చిద్విలాసం

చంద్రగిరి: మంగళ వాయిద్యాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి గురువారం స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీనివాసుడు హనుమంత వాహనంపై వెంకటాద్రి రాముడి అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పరిణయ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 5 మధ్య దివ్యాభరణ, పట్టుపీతాంబరాలతో అలంకృతులైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవర్లను స్వర్ణ రథంపై అధిష్ఠింపజేసి అర్చకులు సంకల్ప పూజలు చేశారు. అనంతరం ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, టీటీడీ అధికారులు స్వామి వారి సర్కారు హారతిని అందుకున్నారు. స్వర్ణ రథాన్ని టీటీడీ అధికారులు, భక్తులు నాలుగు మాడవీధుల్లో లాగారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శ్రీనివాసుడు గజవాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చాడు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు రమణయ్య, చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అనిల్, సీఐ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

శ్రీనివాస మంగాపురం కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం స్వామి వారు ఉదయం సూర్య, రాత్రి చంద్రప్రభ వాహనాలపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగనున్నారు.

భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం

ఏర్పేడు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో గురువారం ధ్వజారోహణం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక క్యూలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. గణపతి పూజ, చండీశ్వర, సుబ్రమణ్యేశ్వర, ఆనందవల్లీ దేవీ ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. వేద పండితులు ధ్వజస్తంభానికి తొలుత దర్భతో వేసిన పవిత్ర దారం, వస్త్రాన్ని అలంకరించారు. మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. పలు ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు.



పుర వీధుల్లో ఊరేగుతున్న ఉత్సవమూర్తి